

# స్నేహం — సుకుమార్

"ఓరి, ఎక్కణ్ణుంచోయ్ ?" అన్నాడు ఆత్రుతగా మురారి, రోడ్డు మధ్య ఆగి బస్సుకు అడ్డంపడి

"ఇంటినుంచే—నువ్వు ?"

"మామూలగా ఆఫీసునుంచే"

"రా, రా బాగా కలిశాం అసలు ఇవాళ మనం కలుస్తామా కలవమా అని ఆలోచిస్తున్నాను ఏమంటే ఉదయం విడిపోయినప్పుడు మళ్లీ ఏమీ అనుకోలేదు చూడూ" అన్నాడు ముకుందం

"ఉదయానికీ ఇప్పటికీ 'ఇవాళ' అని, ఒక రోజుగా లెఖ వేసేశావే" అన్నాడు మురారి, సిగరెట్టు తీసి ముకుందాని కిచ్చి తనోటి నోట్లో పెట్టుకుంటూ

"కాస్త కాఫీ వేసుకొంటే "

"వో, పద "

మురారీ ముకుందమూ వెళ్లి వెళ్లి జన సమ్మర్దం గల హోటల్లోకి దూరారు కూచునేందుకు ఎక్కడా చోటులేదు ఎవరో యిద్దరు కాఫీలు తాగుతుంటే, వాళ్ల వెనక నుంచున్నారు— వాళ్లిహ లేస్తారుగదా అని కాని వాళ్లెవరో లేవ లేదు ఎందుకంటే మళ్లీ చెరో రెండు రెండు ఇడ్లీలూ, సాంబారులో మునగగొడుతూ తెప్పించుకున్నారు

"ఎట్లాగయ్యా మురారీ ?" అన్నాడు ముకుందం

"అదే, ఎట్లాగా అని ముకుందం ?" అన్నాడు మురారి

నించున్న ఈ ఇద్దర్నీ వెళ్లేవాళ్లూ, వచ్చే వాళ్లూ తోసేస్తున్నారు, నెట్టేస్తున్నారు ఒకతను మురారిని నేలమట్టానికి పడద్రోసి వంతెనలా నడిచి వెళ్లిపోదామని ప్లాను వేశాడు కూడా కాని ముకుందం అడ్డుపడ్డాడు మంచి నీళ్లు తెస్తున్న సర్వరు గ్లాసు ముకుందం నెత్తిన కొట్టబోతే, మురారి రక్షించాడు ఇంతలో ఇద్దరెవరో లేచారు ముకుందం, మురారి వెళ్లి అక్కడ కూచుని, 'అమ్మయ్య' అనుకున్నారు అంతలోనే వాళ్లు తిరిగొచ్చి, "మేం కూచున్నామండీ, చేతులు కడుక్కోడానికి వెళ్లాం" అన్నారు

మిత్రులిద్దరూ నీరసంగా లేచారు

"పోదామా యేమిటోయ్ ?" అన్నాడు ముకుందం

"ఆ, ఎట్లాగు వచ్చాం కాస్త కాఫీయైనా తాగి పోదాం నించునయినా" అన్నాడు మురారి అంతలోనే ఎవరో లేవగా చూశాడు, పరుగెత్తాడు. కాని ముకుందానికి చోటు లేదు ఎట్లా ?

"ఇద్దరమూ దీనిమీదే ఇరుక్కుందామా" అని అడిగాడు

"కష్టం బ్రదర్ ఎవరికీ సౌకర్యం ఉండక పోగా నీకు కూడా మహా యిబ్బంది నువ్వు కూచోనే ఉండు నే నిట్లా నించుంటాను"

(43-వ పేజీ చూడండి)

# స్నేహం

(23-వ పేజీ తరువాయి)

"తేరా ముకుందం, నే యిస్తా తే" అన్నాడు మురారి

"ఆ ఏముందిలే ఎవరిస్తేనేం గనక" అన్నాడు ముకుందం

"అందుకే నే విస్తాను—ఏం గనక ఎవరిస్తే"

"ఆఁ, ఎందుకుందూ, లే"




ఇద్దరూ లేచారు నడుస్తున్నారు

"తేరా ముకుందం, బావుండదు" అన్నాడు మురారి

"ఏమిటి బావుండదు నే నివ్వటమా"

"కాదు ఇన్నిసార్లు అడిగించుకోవటం" అంటూనే మురారి ముకుందం చేతిలోని బిల్లును లాగేశాడు

"ఛాఛా, వద్దంటూ వుంటే ఏమిటది ?" అని తిరిగి లాక్కున్నాడు మురారి, కోపంగా

"మళ్లీ లాగకూడదు అట్లా—ఏమిటా ఇది ?" అని మళ్లీ లాగబోయాడు ముకుందం.

"హాఁ, నువ్వే కూచో"

"లేదు నువ్వు కూచుందూ"

"లేదు, నేను నిలుచునే ఉంటాను"

"నేనే నించుంటాను ఫరవాలేదు"

"కాదు నే చెప్పేది విందూ "

"కాదు, నే చెప్పేది " అంతే ! ఈలోగానే ఆ కుర్చీని ఇంకో దారినపోయేదానయ్య ఆక్రమించాడు

"మధ్య దానయ్య తన్నుకుపోయాడు" అన్నాడు మురారి

"అదుగో అక్కడ రెండు సీట్లు ఖాళీ బనయ్ రా, రా, తొందరగా పరుగెత్తాలి ఇంకా స్పీడ్‌గా బాగా ఆ స్పీడ్ చాలదు జోరుగా

ఆ ! లాభం లేదయ్యా—ఎవరో వచ్చేసి కూచున్నారు"

ఇద్దరూ అలసిపోయారు చెమటలు కక్కుతున్నారు అక్కడ పైన ఒక తిరిగీ తిరగని ఫానుంటే దానికింద నించున్నారు 'ఉస్సు' మంటూ

ముకుందమూ మురారీ మాంచి స్నేహితులు చాలా 'మందం' అన్నమాట ! ఒక మంచం మీద పడుక్కుని ఒక కంచంలో తినేవారు అంటే మా పార్థసారథి అన్నట్లుగా, రెండు కంచాలూ మంచాలూ లేక కాదు, ఆ స్నేహం అట్టిది ! అందుకనే ఒక కుర్చీలో కూర్చుని కాఫీ సేవిద్దా మనుకున్నా విధి అడ్డం తిరిగింది

ఈవిధంగా వచ్చిన అడ్డంకుల్ని లక్ష్యపెట్టక, దీక్షాతత్పరుల్లై, క్రమశిక్షణాయుతుల్లై, పెద్దల వాక్యమును మీరనివార్లై, ఎట్టకేలకు—సీటులు సంపాయించుకున్నారు ముకుందమూ, మురారీ

"హే భగవాన్ !" అన్నాడు మురారి

"ఆపద్బాంధవా" అన్నాడు ముకుందం

"ఆహా, భక్తవత్సలా ముకుందా" అన్నాడు మురారి

"హేహే—శ్రీహరీ మురారీ" అన్నాడు ముకుందం

"ఇన్నాళ్లకు మాకు స్థలం దక్కించావు కదయ్యా" అనుకున్నారు ఇద్దరూ నిట్టూర్పులు విడిచేస్తూ

"ఏన్న ఏంకావాలి ?" అన్నాడు వడ్డనదారు

"ఆఁ, ఏమిటి బ్రదర్ ఇడ్లీ తీసుకుందామా,"

"వద్దులే బ్రదర్, పొద్దున్నా అదే సాయంత్రమూ అదే అవుతోంది"

"ఐతే బజ్జీ తిందాం బ్రదర్"

"ఆమాట బావుంది బ్రదర్"

ఇద్దరూ బజ్జీలూ, ఆతర్వాత దోసే, ఆతర్వాత ఒక్కోటే కాఫీ తెప్పించుకున్నారు వడ్డందారు బిల్లు రాసి తెచ్చాడు ముకుందం చెయ్యి చాపి తీసుకున్నాడు

"అదేమిటయ్యా అతని చేతిలో పెడతావూ ?" అన్నాడు మురారి, 'బుద్ధిలేదూ, గడ్డి తింటున్నావా, ఆమాత్రం తెలీదా' అనే ధోరణిలో

"చెయ్యి చాపాడు యిచ్చాను ఆపైన మీరే మన్నా కాండి మాకు అందరూ ఒకటే అసలే మేం 'సర్వ' రులం" అని వెళ్లిపోయాడు, సప్లయ్యరు' గూడకట్టు పైకి మడుస్తూ.

"ముకుందం, పద నామాట విను"

"మురారీ, నామాట విను"

"ఏం, వినేదిలేదు నే నివ్వను" అన్నాడు కోపంగా మురారి, గుప్పిట ముడిచి

"ఇవ్వవూ ? ఎట్లా ఇవ్వవో నేను చూస్తాను" అని కోపంగా గుప్పిట విప్పబోయాడు మురారి గట్టిగా పట్టాడు

"ఇస్తావా లేదా" అని గద్దించాడు ముకుందం.

"ఏంట్రా దబాయిస్తావ్, ఇవ్వను నీ తాతో చెప్పుకో"

"మర్యాదగా అడుగుతున్నంతసేపూ ఇవ్వవురా" అని ముకుందం పౌరుషంగా మురారిపైకి లంఘించాడు ఆ చేతిని అందుకోబోయాడు మురారి తప్పించుకుంటున్నాడు ఇద్దరూ ఒకర్నొకరు గట్టిగా పట్లు పట్టారు బిల్లు కాయితం నలిగి నలిగి చెమటకు తడిసిపోతున్నది ముకుందం మురారిని బలంగా క్రిందకు పడదోశాడు ఈ 'వేడుక' చూస్తూ తింటున్నవాళ్లు కూడా సగం ఇడ్లీముక్క చేతో పట్టుకుని చోద్యంగా చూడసాగారు ఎవరూ విడిపించలేదు ఆ ఆలోచనా లేదు కిందపడ్డ మురారి రొప్పుతూ లేచి, ముకుందాన్ని లాగి క్రిందకు తోసి—"తోస్తావుట్రా" అన్నాడు ఆవేశంగా

"యూ రాస్కెల్" అని లేచి, ఉద్రేకంగా మురారి చెంపమీద చెళ్లుమని చరిచాడు ముకుందం మురారి తిరిగి బలంగా ఒక్కటిచ్చాడు ముకుందం మురారి ఒకరి జుట్టొకరు పట్టుకునారు గుడ్డలు నలిగిపోతున్నయ్ నోటికొచ్చిన దుర్భాషలన్నీ ఆడుతున్నారు ఆయాస పడుతున్నారు రొప్పుతున్నారు క్రింద పడుతున్నారు—లేస్తున్నారు.

కాస్సేపటికి జనం ఇద్దర్నీ విడదీసి "వూరుకోండి వూరుకోండి" అని ముకుందాన్ని బయటకు పంపే ఏర్పాట్లు చేస్తున్నారు కొందరు మురారిని పట్టుకున్నారు మురారి వదిలించుకొని ముకుందం పైకి రాబోయాడు అందరూ కలిసి ముకుందాన్ని బయటకు లాగేశారు మురారి రాబోతే "వుండవయ్యా" అని గసురుకున్నారు

"రారా, రా బయటికి, నీ పని చెప్తాను రారా" అన్నాడు ముకుందం రొప్పుతూ జుట్టు పైకి ఎగదోసుకుంటూ

"పోరా, పోరా రక్తం కళ్ల జూస్తా(నా—ఏమనుకున్నావో" అన్నాడు అంతకన్నా రొప్పుతూ మురారి జనం వారిస్తున్నారు

సాయంపట్టి ముకుందాన్ని వో ప్రక్కకూ, మురారిని వో ప్రక్కకూ నెట్టేశారు—వీధిలోకి మురారిని పట్టుకొని కొందరూ, ముకుందాన్ని పట్టుకుని కొందరూనూ ఇద్దరిమధ్యా అర ఫర్లాంగ దూరం ఉండేట్టు విడదీసేశారు

"అటుపక్క రారా, నీ రక్తం " అంటున్నాడు మురారి

"నీ తల వెయ్యి చెక్కలు చేస్తా(నా నా తడాఖా తెలీదు" అంటున్నాడు ముకుందం

కాఫీహోటలు మధ్యభాగంలో చెమటతో అల్లుకుపోయిన నేలమీద నానిపోయి చివికిపోయిన బిల్లు కాయితం ముక్కలు వచ్చే పోయే జనం కాళ్లక్రింద పడి మరింత నలుగుతున్నై ★